క్లుప్తంగా

సుబ్బారెడ్డిని కలిసిన జెడ్పీటీసీ రాంబాబు



సుబ్బారెడ్డికి బుచ్చెయ్యపేట సమస్యలను విన్నవిస్తున్న రాంబాబు

బుచ్చెయ్యపేట : రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డిని ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీటీసీల ఫోరం సంఘ అధ్యక్షుడు బుచ్చెయ్యపేట జెడ్పీటీసీ దొండా రాంబాబు గురువారం కలిశారు. విజయవాడలో సుబ్బారెడ్డిని తన కార్యాలయంలో కలిసిన రాంబాబు బుచ్చెయ్యపేట మండలంలో ఉన్న పలు సమస్యలను ఆయనకు విన్నవించారు. ఎర్రవాయి ప్రాంతంగా గుర్తుంపు పొందిన బుచ్చెయ్యపేట మండలంలో తీవ్ర తాగునీటి సమస్య ఉందని తాగునీటి బోర్లు మంజూరుకు, ఇతర సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని సుబ్బారెడ్డికి ఆయన వినతి పత్రం అందించారు. సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని సుబ్బారెడ్డి హామీ ఇవ్వడంపై జెడ్పీటీసీ సంతృప్తి వ్యక్తం చేశారు. తైపురం సర్పంచ్ ముచ్చకర్ల శ్రీను, సామాజిక కార్యకర్త ఆకుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



చీరలను అందిస్తున్న సన్నిబాబు

కె.కోటపాడు : స్థానిక షిర్డీసాయిబాబు ఆలయం వద్ద కింతాడకు చెందిన కుభిరెడ్డి సన్నిబాబు గురువారం 20 మంది పేదమహిళలకు చీరలను అందించారు. సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాల్లో భాగంగా కుటుంబ సభ్యులతో కలిసి పేద మహిళలకు చీరలను అందించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పేద స్థితిలో ఉన్న వారికి సహాయం అందించడాన్ని బాధ్యతగా గుర్తించాలని కోరారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేగి రామారావు, ఉమ, లిఖిత తదితరులు పాల్గొన్నారు.

పీజీ కోర్సులకు అవకాశం కల్పించాలి

- స్పీకర్ అయ్యన్నకు ఎస్ఎఫ్ఐ నాయకుల విజ్ఞప్తి



స్పీకర్‌కు సమస్య విన్నవిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నర్సీపట్నం : ఆంధ్రా యూనివర్సిటీలో పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పీకర్ అయ్యన్నను జిల్లా ఎస్ఎఫ్ఐ విభాగం ప్రెసిడెంట్ గీతాకృష్ణ కోరారు. స్పాట్ అడ్మిషన్లు చేయకపోవడంతో ప్రైవేట్ కళాశాలలో మెరిట్ లేకపోయినా అడ్మిషన్లు జాయిన్ చేయడం జరుగుతుందని, ఆంధ్రా యునివర్శిటీలో స్పాట్ అడ్మిషన్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. దీని వల్ల ఎంతో మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే చర్యలు తీసుకుని విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. దీనికి ఆయన స్పందిస్తూ ఏయూ వీసీతో మాట్లాడి సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాముడు, మోహన్, సాయి పాల్గొన్నారు.

సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి



పొంగలిపాకలో సంపద కేంద్రం పరిశీలిస్తున్న ఎంపీడీవో అప్పారావు తదితరులు

మాడుగుల: మండలంలో ఒమ్మలి, పొంగలిపాక గ్రామాల్లో సచివాలయాలను ఎంపీడీవో అప్పారావు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పంచాయతీ నిర్వహణపై పంచాయితీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెత్త నుంచి సంపద కేంద్రాలను సందర్శించారు. వీటిని వినియోగంలోకి తీసుకురావాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈ రోడ్లపై ఇదీ సమస్య!

- రోడ్డు మార్జిన్ కన్పించకుండా పెరిగిపోయిన తుప్పలు
- తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టని అధికారులు
- భయం భయంగా వాహనదారుల రాకపోకలు



నర్సీపట్నం తుని మధ్య ఆర్అండ్‌బీ రోడ్డు మార్జిన్ దిగలేని విధంగా పెరిగిపోయిన తుప్పలు



నాతవరం వెళ్లే రోడ్డుకిరువైపులా పిచ్చి మొక్కలు

నాతవరం : ఏ రోడ్డు ఎటు చూసినా రోడ్డు మార్జిన్ కప్పేసేలా పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలో నర్సీపట్నం తుని మధ్య ఆర్అండ్‌బీ రోడ్డు సుమారుగా 18 కిలోమీటర్లు పొడవునా పిచ్చి మొక్కలు పెరిగిపోయి వచ్చే పోయే వాహనాలు కనిపించకుండా దర్శనమిస్తున్నాయి. ఈ రోడ్డులో రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించాలంటే అనేక బాధలు పడుతున్నారు. రోడ్డు మార్జిన్‌లో దిగడానికి వీలు లేకుండా పెరిగిపోయిన చెట్ల కొమ్మలు, తుప్పలతో ఏసమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంతో ప్రయాణిస్తున్నారు. తాండవ జంక్షన్ నుంచి నాతవరం వెళ్లే రోడ్డు, డి.యర్రవరం జంక్షన్ చుంచి జిల్లేడుపూడి చెర్లోపాలెం వెళ్లే రోడ్డు, తాండవ ప్రాజెక్టు నుంచి నాతవరం గుమ్మడిగొండ పెదగొలుగొండపేట చిక్కుడుపాలెం వెళ్లే అర్అండ్‌బీ రహదారులకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టాల్సి ఉంది. అదే విధంగా మారుమూల ప్రాంతాలకు వెళ్లే సరుగుడు కె.వి.శరభవరం ఉలమల్ల, తాళ్లపాలెం రహదారులు సైతం అధ్వానంగా ఉన్నాయి. ఈ రోడ్లలో ప్రతి రోజు ఏదో ఒక ప్రాంతంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి మరింత ఏపుగా పెరిగిపోయాయని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి రహదారులకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని కోరుతున్నారు.

ఆవు పాల సేకరణ ధర తగ్గింపుపై రైతుల ఆందోళన



చౌడువాడలో డెయిరీ ఎదుట పాల కేన్‌లతో నిరసన తెలుపుతున్న రైతులు

కె.కోటపాడు : విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవు పాల ధరను తగ్గించే చర్యలను తీసుకోవడంపై చౌడువాడ విశాఖ డెయిరీ ఎదుట పాడి సభ్య రైతులు పాల కేన్‌లతో గురువారం నిరసన తెలిపారు. ఆవుపాలకు వెన్నశాతం బట్టి లీటర్‌కు గరిష్ఠంగా చెల్లించే ధర రూ.44.5 పైసల నుంచి రూ.40.86 పైసలకు తగ్గించడం వల్ల పాడి రైతులు ఆర్థికంగా నష్టపోతారని వారు తెలిపారు. పశుపోషణకు తవుడు, నూకలు, ఫీడ్ ధరలు పెరిగిపోతున్న సమయంలో పాల ధరను డెయిరీ యాజమాన్యం తగ్గించడం అన్యాయమని అన్నారు. గత రెండేళ్ల నుంచి విశాఖ డెయిరీ నుంచి రైతులకు బోనస్ నగదును అందించలేకున్నా, ప్రస్తుతం ధరను తగ్గించే చర్యలు వెనక్కి తీసుకొని ఆవుపాలకు గతంలో ఉన్న మద్దతు ధరను అందించాలని కోరారు. ఈ సందర్భంగా అక్కడకు చేరుకున్న విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ రైతులతో మాట్లాడారు. డెయిరీ యాజమాన్యంతో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు తీసుకువచ్చిన పాలను విశాఖ డెయిరీకి వేశారు.

పేదలకు ఉచిత వైద్యసేవల ఘనత వైఎస్ కుటుంబానిదే



దిబ్బిడిలో కంటి వైద్య సేవలను పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ, సర్పంచ్

బుచ్చెయ్యపేట : పేదలకు కార్పొరేటు వైద్య సేవలు అందించిన ఘనత వై.ఎస్ కుటుంబానికే దక్కుతుందని వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం తెలిపారు. గురువారం దిబ్బిడి గ్రామంలో విశాఖకు చెందిన ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య సేవలను పరిశీలించిన వీరు దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి పేదోడికి, ధనికుడికి ఒకే దగ్గర వైద్య సేవలు అందాలన్న దృఢ సంకల్పంతో ఆరోగ్య శ్రీ వైద్య సేవలు తీసుకురాగా ఆయన కుమారుడు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రిబాటలోనే నిలిచి పేదోడికి రూ, 25 లక్షల వరకు వైద్య సేవలు అందేలా ఆరోగ్య వైద్య సేవలను విస్తరించారన్నారు. నేత్ర సమస్యలతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్య సేవలు అందించి దృష్టి లోపాలను సరిచేస్తున్న ఎల్.వి ప్రసాద్ ఆసుపత్రి వైద్య సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. సంస్థ కో ఆర్డినేటర్ ఆర్. సోములు, వైద్య సిబ్బంది సాయికుమార్, అనూష, మహేంద్ర రోగులకు ఉచిత వైద్య సేవలు మందులు అందించారు. దిబ్బిడి, నేతవానిపాలెం గ్రామాల నుంచి 80 మంది వైద్య శిబిరంలో పాల్గొనగా వీరిలో దృష్టి లోపం ఎక్కువగా ఉన్న 25 మందిని కంటి చికిత్సలకు, 20 మందికి కళ్లద్దాలకు ఎంపిక చేశారు. పంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కండి



మాట్లాడుతున్న ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం

దేవరాపల్లి : గ్రామ పంచాయతీ పరిపాలనపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని, గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని దేవరాపల్లి ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉప సర్పంచ్‌లు, పంచాయితీకి ఇద్దరు వార్డు మెంబర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో ఎం.వి. సువర్ణరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి పంచాయతీలకు వచ్చే నిధులు, వాటి వినియోగంపై సమగ్రంగా వివరించారు. వార్డు సభ్యుల బాధ్యతలు, అధికారాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారిలక్ష్మీనారాయణ, ఇంచార్జ్ ఈవోపీఆర్డి అప్పారావు, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ త్రినాథ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కె .కోటపాడు: కె.కోటపాడు సబ్ స్టేషన్ పరిధిలో గల 11 కె.వి. విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టనున్నట్టు విద్యుత్ ఏఈ ఎం. చంద్రశేఖర్ గురువారం సాయంత్రం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. చెట్టుకొమ్మలను తొలగించడం వల్ల శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కె. కోటపాడులో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

దేవరాపల్లి: దేవరాపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పినకోట ఫీడర్‌లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎలక్ట్రికల్ ఏఈఈ కె.శంకరరావు తెలిపారు. లైన్ మెయింటెనెన్స్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. పినకోట ఫీడర్ పరిధిలోని పినకోట, పెదకోట, జీనబాడు, వాలాబు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

నట్టల నివారణకు టీకాలు



నట్టల నివారణకు గొర్రెలకు టీకాలు వేస్తున్న దృశ్యం

గొలుగొండ : గొర్రెలు, మేకల్లో వచ్చే రోగాలు నివారణకు ముందుగానే నట్టల నివారణకు టీకాలు వేయించుకోవాలని పశు సంవర్ధక శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చందక నరసింహులు తెలిపారు. కొమిర ప్రాంతంలో గురువారం మండల పశువైద్యాధికారులు టీకాలు వేస్తున్న సమయంలో ఆయన పరిశీలించారు. ఎర్రవరం, పోలవరం, ఎరకంపేట, ఏఎల్‌పురం, గొలుగొండ, కొత్త మల్లంపేట ప్రాంతాల్లో అధికంగా గొర్రెలు, మేకలు ఉన్నాయని తెలిపారు. ముందుగానే నట్టల నివారణ టీకాలు వేయడం వల్ల మేకలు, గొర్రెల్లో మరణాలు తగ్గుతాయని, అధిక బరువు వస్తుందని పెంపకందారులకు తెలిపారు. ఈనెల 16 నుండి 31 వరకు అన్ని ప్రాంతాల్లో టీకాలు వేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నర్సీపట్నం సహాయ సంచాలకులు రాంబాబు, గొలుగొండ, కృష్ణదేవిపేట పశు వైద్యాధికారులు రమేష్, శిరీష పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు

రోలుగుంట : అభివృద్ధే లక్ష్యంగా అధికారులు విధులు నిర్వహించాలని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం మండల సమావేశం ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీవో నాగేశ్వరరావు నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గృహనిర్మాణ పథకాల ద్వారా గృహాలు మంజూరై ఇప్పటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయని వారు వచ్చే ఏడాది మార్చి 31లోగా పూర్తి చేసుకోవాలన్నారు. రోలుగుంట పీహెచ్‌సీ వైద్యురాలు మాట్లాడుతూ పీహెచ్‌సీలో అన్ని ఆరోగ్య పరీక్షలు చేయడం జరుగుతుందని, గర్భిణికి అవసరమైన శిశువు ఎదుగుదల, ఆరోగ్య పరిస్థితులు తెలియజేసే స్కానింగ్ పరీక్ష సదుపాయం కూడా ఉందని తెలిపారు. సమావేశంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. జెడ్పీటీసీ పోతల లక్ష్మీ రమణమ్మ, వైస్ ఎంపీపీ సన్యాసినాయుడు, రెండో వైస్ ఎంపీపీ వరలక్ష్మి పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరానికి స్పందన



పాడి రైతులకు సూచనలు, సలహాలు అందిస్తున్న ఏడీ చిట్టినాయుడు

మాడుగుల : గాదిరాయి గ్రామంలో గురువారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరం జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా 30 పెయ్యిలకు నట్టల నివారణ మందులు, 36 పశువులకు గర్భకోశవ్యాధులకు, 12 ఎద కురాని పశువులకు, 8 చూడి పశువులకు, 116 పశువులకు సాధారణ చికిత్సలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే 25 మంది పాడి రైతులకు మినరల్ మిక్చర్ పాకెట్లు, లివర్ టానిక్‌లు అందజేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు అద్దేపల్లి జగ్గారావు, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం నుంచి సౌజన్య, ఖండివరం పశువైద్యాధికారి గణేష్, జేడీపేట వెటర్నరీ అసిస్టెంట్ సత్యం, పశుసంవర్ధక సహాయకులు మోదినాయుడు, శివ, గోవింద్, శ్రీను పాల్గొన్నారు

విద్యార్థులకు కెరీర్ కౌన్సెలింగ్



విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలపై వివరిస్తున్న సెట్విస్ రీసోర్స్ పర్సన్ బాబు

కె.కోటపాడు : విద్యార్థులు ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్‌పై అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని సెట్విస్ రీసోర్స్ పర్సన్ ఎస్.ఎ. బాబు అన్నారు. కె.కోటపాడు అయ్యన్న పాఠశాలలో 8 నుంచి10 తరగతి విద్యార్థులతో పాటు ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు గురువారం కెరీర్ కౌన్సెలింగ్‌పై అవగాహన కల్పించారు. ఉద్యోగానికి అవసరమైన అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఇంటర్వ్యూ సమయంలో ఒత్తిడికి గురయ్యే పరిస్థితి ఉంటుందన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ ద్వారా ఉద్యోగార్థులు ఎటువంటి ఒత్తిడి అధిగమించవచ్చని ఆయన పేర్కొన్నారు. యువత మంచి ఉద్యోగ అవకాశాలను సాధించాలన్న లక్ష్యంతో చదువులు అందిపుచ్చుకోవాలని అయ్యన్న విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ అన్నారు.

సమన్వయంతో గ్రామాల అభివృద్ధి

మాకవరపాలెం : పాలకవర్గాల కృషితోనే పంచాయతీల అభివృద్ధి సాధ్యమని ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీతా మహాలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన శిక్షణను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో అందరూ సమన్వయం చేసుకుంటూ పనులు చేయాలన్నారు. ఉపసర్పంచ్, వార్డు సభ్యుల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

నర్సీపట్నం : రామాయణం రచించిన వాల్మీకి మహర్షి జయింతి కార్యక్రమం గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి దమయంతి మాట్లాడుతూ రామాయణం రాయడానికి వాల్మీకి ఎంతో కృషి చేయడం జరిగిందని తెలిపారు. వాల్మీకి మహర్షి గొప్పతనం గురించి వివరించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయు అవార్డు గ్రహీత ప్రభాకర్ మాట్లాడుతూ వాల్మీకి రామాయణం ప్రపంచంలోనే ఉత్తమ గ్రంథంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో సత్తిబాబు పాల్గొన్నారు.

పాచిలవానిపాలెంలో గౌరీపరమేశ్వరుల కొలువు



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కె.కోటపాడు : పాచిలవాని పాలెం గ్రామంలో గౌరీపరమేశ్వరులను గ్రామస్థులు బుధవారం ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా గౌరీపరమేశ్వరులను గ్రామంలో గల రామాలయంలో ఏర్పాటు చేసి గ్రామస్తులు పూజలు చేస్తారు. బుధవారం రాత్రి గ్రామంలో గల ప్రధాన వీధుల్లో గౌరీపరమేశ్వరుల ఊరేగింపును నిర్వహించిన అనంతరం రామాలయంలో ఉంచి పెద్ద సంఖ్యలో మహిళలు పూజలు జరిపారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



రత్నంపేట సచివాలయంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్డీవో రమణ



తామరబ్బ రెవెన్యూ గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీదేవి

దేవరాపల్లి : రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారమే రెవెన్యూ గ్రామ సభల లక్ష్యమని దేవరాపల్లి తహసీల్దార్ పి.లక్ష్మీదేవి అన్నారు. ఈ మేరకు తామరబ్బలో స్థానిక సర్పంచ్ టోకురి రామకృష్ణ అధ్యక్షతన గురువారం రెవెన్యూ గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ గ్రామ సభలో వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కార మార్గాన్ని చూపిస్తామని తహసీల్దార్ పి.లక్ష్మీదేవి సూచించారు. శుక్రవారం ఇదే పంచాయతీ పరిధిలోని పల్లపుకొడాబు గ్రామంలో గ్రామసభను నిర్వహిస్తామని తెలిపారు. మండల సర్వేయర్ గోవిందరాజులు,వీఆర్‌వో దేముడమ్మపాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 85 దరఖాస్తులు

మాకవరపాలెం: రెవెన్యూ సదస్సులో 85 దరఖాస్తులు అందాయి. మండలంలోలి తాడపాలలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడ జరిగిన రీసర్వేలో పలు సమస్యలు ఉన్నాయంటూ రైతులు అధికారులకు దరఖాస్తులు అందించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ సదస్సులో మొత్తం 85 దరఖాస్తులు వచ్చాయని డీటీ సోమశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ కృష్ణమూర్తి, ఆర్ఐ జెట్టి, బీఆర్వో రమణ పాల్గొన్నారు.

కరక గ్రామసభలో 42 దరఖాస్తులు

బుచ్చెయ్యపేట : మండలంలో గల కరక గ్రామంలో గురువారం జరిగిన భూ సమస్యలు పరిష్కార గ్రామ సభలో 42 మంది రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించాలని దరఖాస్తులు చేసుకున్నారు. తహసీల్దార్ లక్ష్మి తమ సిబ్బందితో గ్రామ సభ నిర్వహించారు. పలువురు రైతులు తాము సాగు చేస్తున్న భూములు ఎక్కువగా ఉండగా రెవెన్యూ రికార్డుల్లో తక్కువగా నమోదు చేశారని, సర్వే నంబర్లు తప్పులు దొర్లాయని, రికార్డుల్లో పేర్లు తప్పుగా నమోదు చేశారని, వాటిని సరి చేయాలని కోరుతూ దరఖాస్తులు అందించారు. ఫిర్యాదులను పరిశీలించి 15 నుండి 30 రోజుల్లో భూ సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. ఎంపీపీ నాగేశ్వరిదేవి,వీఆర్వో రమణ పాల్గొన్నారు.

రత్నంపేట సచివాలయంలో...

రోలుగుంట: ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సభల ద్వారా రైతులకు మేలు జరుగుతుందని నర్సీపట్నం ఆర్డీవో రమణ అన్నారు. మండలంలో ఈ సదస్సుల్లో రైతులు తమ భూ సమస్యలు తెలిపి పరిష్కరించుకోవాలన్నారు. బొట్టవాని గైరంపేట గ్రామ సభను రైతులకు వీలుగా రత్నంపేట సచివాలయంలో గురువారం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ శంకర్రావు గతంలో జరిగిన భూ రీసర్వేల్లో ఏమైనా సమస్యలు తలెత్తితే సభలో తగు ఆధారాలతో అర్జీలు అందజేసి పరిష్కరించుకోవాలని రైతులను కోరారు. రైతుల నుంచి వచ్చిన ఎనిమిది అర్జీలను స్వీకరించారు. ఆర్ఐ రామ్మూర్తి ఫిర్యాదులు నమోదు చేసుకున్నారు.

ఒకే ఒక్క దరఖాస్తు...

నాతవరం: గతంలో చేసిన భూ రీసర్వేలో లోపాలు ఉంటే సరిచేసుకునేందుకు చక్కటి అవకాశమని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ అన్నారు. మండలంలో భూ రీసర్వే చేసిన చొల్లంగిపాలెం రెవెన్యూ పరిధిలో భూములకు సంబంధించి గ్రామసభ గురువారం ఎం.బి.పట్నం రామాలయం వద్ద నిర్వహించారు. రీసర్వే చేసిన భూములకు సంబంధించి ఎటువంటి లోపాలు ఉన్నా దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి సరిచేస్తామని తెలిపారు. కాగా ఈ గ్రామసభలో ఒక్కరైతు మాత్రమే ఫిర్యాదు అందించారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ శివ, మండల సర్వేయరు ప్రసాద్, వీఆర్వో సత్తిబాబు, మాజీ వైస్ ఎంపీపీ బాపన్ననాయుడు పాల్గొన్నారు.

కొత్తపాలెంలో...

గొలుగొండ: గ్రామాల్లో భూ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందని తహసీల్దార్ శ్రీనువాసరావు తెలిపారు. పాతమల్లంపేట పంచాయతీ కొత్తపాలెం గ్రామంలో గురువారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులు స్వీకరించారు. వాటి సమస్యలను వెంటనే పరిష్కారం చేయడం జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చైనులు, సర్పంచ్ ఆదిలక్ష్మితో పాటు రెవెన్యూ సిబ్బంది. రైతులు పాల్గొన్నారు.

రీ సర్వేలో లోపాలుంటే సరిచేస్తాం

మాడుగుల రూరల్ : రీ సర్వే పూర్తి అయిన భూములకు సంబంధించి, రీ సర్వేలో తప్పులు వుంటే రాతపూర్వకంగా ఫిర్యాదులు అందించాలని తహసీల్దారు కె.రమాదేవి కోరారు. పోతనపూడి పంచాయతీ పరిధిలో గల భాగవతుల అగ్రహారం రెవెన్యూ పరిధికి సంబంధించి గ్రామ సభ పెంటయ్యపాలెం రామాలయం వద్ద రెవెన్యూ సభలు ఏర్పాటు చేశారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్ఓఆర్ రికార్డుల్లో అభ్యంతరాలు వుంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై 10 మంది దరఖాస్తులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ భవానీ, సాంబమూర్తి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చెల్లంనాయుడు, సర్వేయర్ గణపతి, రీ సర్వే డీటీ జగదీశ్, వీఆర్ఓ శ్రీను పాల్గొన్నారు.

ఆర్గానిక్ కెమిస్ట్రీ స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు

చోడవరం రూరల్ : స్థానిక డిగ్రీ కళాశాలలో 2024–25 గాను ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ పి.కిరణ్ కుమార్ తెలిపారు. ఏపీపీజీ సెట్ –2024 అర్హత పొందిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. అడ్మిషన్స్ కొరకు హాజరయిన విద్యార్థులు ఎపీ పీజీ సెట్ అర్హత పత్రం, ఇతర ఒరిజినల్, మరియూ జెరాక్స్ కాపీలతో ప్రిన్సిపాల్ కార్యాలయంలో హాజరు కావాలన్నారు. వివరాలకు పీజీ సెట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మి మంగమ్మ ఫోన్ 9550395298 లో సంప్రదించాలని సూచించారు.

పలు గ్రామాల్లో జోరున వర్షాలు



మాడుగులలో కురుస్తున్న భారీ వర్షం

మాడుగుల రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గురువారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షం ఖరీఫ్ వరి పంటకు మేలు చేసింది. వారం రోజులుగా కాస్తున్న ఎండలకు వరి పంటకు నీరు లేక రైతులు అవస్థ పడ్డారు. తాజాగా వర్షాలు కురవడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షం వరి పంటతో పాటు కూరగాయలు, పంటలు, చెరకు పంటకు ఎంతో అనుకూలంగా ఉంటుందని రైతులు తెలిపారు.